కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో ఉద్యోగాలు రావు

మాట్లాడుతున్న హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

- మెగా డీఎస్సీకి అతీగతి లేదు
- ఆరు గ్యారంటీలంటూ మోసం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి21: కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో నిరుద్యోగులకు కొత్త ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదని, రేవంత్ సర్కారు చేపట్టిన కుల గణన పూర్తిగా తప్పుల తడక అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని రంగంపల్లి ఎంకేఆర్ బంకెట్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు తీర్చుతామని ప్రగల్భాలు పలికి నేటికి తీర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా పీఆర్సీ కమిటీ వేయలేదనారు. జాబ్ క్యాలండర్ విడుదల చేశామని అబద్ధాలు చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని, మెగా డీస్సీ జాడలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన 56వేల ఉద్యోగాలను కాంగ్రెస్ ఇచ్చినట్లు చెప్పుకుంటుందని వివరించారు.

రూ. 50వేల కోట్ల దోపిడీకి ప్రణాళిక

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ప్రవేశపెడితే విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం 50 వేల కోట్లు దోచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క గతంలో మాట్లాడిన వీడియోలను మీడియా సమావేశంలో చూపుతూ వివరాలు తెలిపారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య, ఎమ్మెల్సీ అభ్యర్థులు కొమురయ్య, అంజిరెడ్డి, బీజేపీ నాయకులు గోమాసే శ్రీనివాస్, శ్రీనివాసరావు, సనిల్‌రెడ్డి, సంజీవరెడ్డి, పర్వతాలు, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఫ్లెక్సీలో ఫొటోలేదని గోమాసే రగడ

రంగంపల్లిలో కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి ఏర్పాటు చేసిన మీ డియా సమావేశం ఫ్లెక్సీలో తన ఫొటో లేకపోవడంపై పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన గోమాసే శ్రీనివాస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలో తన ఫొటో పెట్టకుండా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి పిలిచి అవమానించారని రగడ చేశారు. ''ఎందుకు పిలుస్తారు.. ఎందుకిలా చేస్తారు'' అంటూ ఆవేదన చెందారు. ''ప్రొటో కాల్ ప్రకారం ఫొటో పెట్టాలి గదా.. ఎంపీగా పోటీ చేసిన సందర్భంలో కూడా చాలా మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు నాకు మద్దతు ఇవ్వలేదు'' అని మండిపడ్డారు. బీజేపీ నాయకులందరూ సంపూర్ణ మద్దతు ఇస్తే తాను పెద్దపల్లి ఎంపీగా గెలిచేవాడినని తెలిపారు. కాగా, ఇందతా బండి సంజయ్ రాకకు ముందు జరుగగా.. వీడియో ఆలస్యంగా వైరల్ కావడంతో ఫ్లెక్సీ రగడ బయటికి వచ్చిందని బీజేపీ శ్రేణులు వాపోయారు. అలగిన గోమాసే శ్రీనివాస్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి బుజ్జగించే ప్రయత్నం చేశారు.''అన్న కొత్తగా అధ్యక్షుడినయ్యా.. కొంచం ఆలోచించు. మరోసారి జరుగకుండా చూస్తా అన్నా ..'' అంటూ బతిమిలాడడంతో మెత్తబడ్డ గోమాసే అసంతృప్తి చెంది అలకవీడారు. ఫ్లెక్సీ గొడవ స్థానికంగా దూమారం రేపింది.

రేషన్ బియ్యం పట్టివేత

ఓదెల, ఫిబ్రవరి 21: ఓదెల నుంచి మహారాష్ట్రకు రేషన్ బియ్యాన్ని తరలించడానికి ప్రయత్నిస్తున్న లారీని విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. 232 క్వింటాళ్ల బియ్యాన్ని లారీలోకి ఎక్కిస్తుండగా అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన లారీ, జీపు, ఆటోలను సీజ్ చేసి పొత్కపల్లి ఠాణాకు తరలించారు. వివిధ గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి లారీలో మహారాష్ట్రకు తరలించేందుక యత్నిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో ప్రణయ్, శ్రీను, మనోజ్‌మిశ్ర, నాగరాజుల పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సివిల్ సప్లై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కమీషనర్ ప్రభాకర్, టీం సభ్యులు పాల్గొన్నారు.

10జీపీఏ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

గోదావరిఖని, ఫిబ్రవరి 21: సింగరేణి ఉన్నత పాఠశాల సెక్టార్ 2 తెలుగు ఉపాధ్యాయురాలు శశికళ తన కుమారుడు అనుదీప్ జ్ఞాపకార్థం అనుదీప్ ట్రస్ట్ ద్వారా 2023-24లో పదో తరగతిలో టాప్ 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ఒకొక్కరికి రూ. 1,116 చొప్పున నగదు అందజేశారు. శుక్రవారం స్కూల్‌లో జరిగిన వార్షికోత్సవంలో ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. ఇక్కడ సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటి సెక్రటరీ జీ శ్రీనివాస్, పాఠశాల కరస్పాడెంట్ కిరణ్‌బాబు, హెచ్ఎం శ్రీనివాస్, లేడీస్ క్లబ్ సెక్రటరీ చిలుక లక్ష్మీ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

వీసీలో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లి, ఫిబ్రవరి21: జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. గ్రాడ్యుయేట్ , టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల ఏర్పాట్లపై శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో సమావేశం ద్వారా ఆయన సమీక్షించారు. పోలింగ్ నిర్వాహణపై పలు సూచనలు చేశారు. పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ దాసరి వేణు వీసీలో పాల్గొన్నారు. జిల్లాలో పోలింగ్ నిర్వాహణ ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందిని నియమించి అవసరమైన శిక్షణ అందించామని తెలిపారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు కరీంనగర్‌తో సమన్వయం చేసుకుంటూ అందుబాటులో పెట్టుకున్నామన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య పోలింగ్ సామగ్రి కరీంనగర్ కు తరలించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పోలింగ్ రోజు ప్రతి రెండు గంటలకు రిపోర్ట్ అందించేలా ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నామని వివరించారు. సమావేశంలో ఎస్‌డీసీ శ్రీరాములు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విజయ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

కీలక ఖనిజాల ఉత్పత్తికి సింగరేణి శ్రీకారం

అధికారులతో సింగరేణి సీఎండీ బలరాం నాయక్

గోదావరిఖని, ఫిబ్రవరి 21: కాలుష్య రహిత భారత్ కోసం కీలక ఖనిజా ఉత్పత్తికి సింగరేణి శ్రీకారం చుట్టనుందని, సీఎండీ బలరాం నాయక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో కీలక ఖనిజాలపై క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సుకు సీఎండీ హాజరై మాట్లాడారు. బ్యాటరీ వాహనాలు, సోలార్ విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి కీలక ఖనిజాలకు అనుహ్య డిమాండ్ ఏర్పడుతున్నదన్నారు. భారత్ స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వరంగం సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి సంస్థ కీలక ఖనిజ పరిశ్రమ రంగంలోకి అడుగు పెట్టడానికి సంసిద్ధమైందని చెప్పారు. ఇప్పటికే సింగరేణి ఐఐటీతో ఒప్పందం కుదుర్చుకున్నదని చెప్పారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి విడుదలయ్యే ఫ్లైయాష్, క్లే, ఓపెన్‌కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ నుంచి రేర్ ఎర్త్ ఎలిమెంట్‌ను వెలికి తీసే అశంపై పరిశోధనలు ప్రారంభమైనట్లు వివరించారు.ఇక నుంచి సింగరేణి సంస్థ కేవలం బొగ్గు తవ్వకానికే పరిమితం కాకుండా కీలక ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తి రంగాల్లో అడుగు పెట్టనుందని వివరించారు. ఇక్కడ హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి, సింగరేణి ఈడీ కోల్ మూమెంట్, కోఆర్డినేషన్ డీఎం సుభాని, క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ చైతన్య మొయి గంగూలీ, ఎండీ సందలీప్ హామిల్టన్, సింగరేణి జీఎంలు ఉన్నారు.

హైకోర్టులో సింగరేణి స్టాండింగ్ కౌన్సిల్‌గా రమణకుమార్‌రెడ్డి

రమణ కుమార్‌రెడ్డి

మంథని, ఫిబ్రవరి 21: రాష్ట్ర హైకోర్టులో సింగరేణి అదనపు స్టాండింగ్ కౌన్సి ల్‌గా పట్టణానికి చెందిన చందుపట్ల రమణ కుమార్‌రెడ్డిని నియమిస్తూ ప్రభు త్వ న్యాయ వ్యవహారాలు, శాసన వ్యవహారాల కార్యదర్శి ఆర్ తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రమణ కుమార్‌రెడ్డి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి ద్వారా చార్జి తీసుకున్నారు. దీంతో స్టాండింగ్ కౌన్సెల్స్-తెలంగాణ రాష్ట్రం కోసం హైకోర్టులో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కి అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది రమణ కుమార్‌రెడ్డి మూడేళ్లపాటు వ్యవహరించనున్నారు. సింగరేణి గనులు విస్తరించి ఉన్న పెద్దపల్లి జిల్లా నుంచి స్టాండింగ్ కౌన్సిల్‌కు ఎంపిక కావడంతో సింగరేణి సంస్థ, ఉద్యోగులు, ల్యాండ్ అక్విజేషన్, కాంట్రా క్టు, సర్వీస్ మ్యాటర్స్, ఇతర న్యాయ వ్యవహారాల పరిష్కారానికి కృషి చేస్తానని రమణ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

దీక్షలో లోకో పైలట్లు

రెండోరోజూ కొనసాగిన లోకో పైలట్ల దీక్ష

జ్యోతినగర్(రామగుండం), ఫిబ్రవరి 21: లోకో పైలట్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రామగుండం రైల్వేస్టేషన్‌లో చేపట్టిన దీక్ష శుక్రవారం రెండోరోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ రామగుండం బ్రాంచీ నాయకులు మాట్లాడుతూ భారతీయ రైల్వేలో లోకో పైలట్ల విధులు కీలకమని తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. రెండు రోజుల దీక్ష విజయవంతంగా ముగిసినట్లు తెలిపారు. ఇక్కడ రామగుండం బ్రాంచీ లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్‌కే పాల్, సెక్రెటరీ సీహెచ్ రవి, కోశాధికారి సచిన్ రంజన్, దాసరి కిరణ్, అజయ్, పీ వంశీ, వినోద్, నవీన్, అరుణ్, ప్రశాంత్, ఎండీ రఫీ ఉన్నారు.

ఆర్జీ-2 ఏరియా ఉత్పత్తిపై సమీక్ష

యైటింక్లయిన్ కాలనీ ఫిబ్రవరి 21 : ఆర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3 ప్రాజెక్టు, వకీలుపల్లి గని బొగ్గు ఉత్పత్తిపై అధికారులతో ఏరియా జీఎం బండి వెంకటయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం కాన్ఫరెన్స్ హాలులో డివిజన్‌లోని వివిధ విభాగాల అధికారులతో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, పని స్థలాల పెంపు, రక్షణ సూత్రాల అమలు, యంత్రాల మరమ్మతులు తదితర అంశాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనలో మరో 40రోజులు మాత్రమే ఉందన్నారు. ఈ గడువులోగా వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రధానంగా యంత్రాల పని గంటలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం ఎం రాముడు, ఇంజినీర్ నర్సింహారావు, అధికారులు నెహ్రూ, రాజాజీ, సంతోష్ కుమార్, మురళీకృష్ణ, అనిల్ కుమార్, ఎర్రన్న, భూక్యా దేశాయి, చంద్రశేఖర్, రవికిరణ్ పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం

ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 ప్రాజెక్టు ఏజెంట్‌గా పని చేస్తూ జీఎంగా ప్రమోషన్ పొందిన సుంకరి మధుసూదన్‌ను సీఐటీయూ నాయకులు సన్మానించారు. శుక్రవారం ఓసీపీ-3 ప్రాజెక్టు ఏజెంట్ కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపిక అందజేశారు. ఇక్కడ డివిజన్ కార్యదర్శి కుంట ప్రవీణ్ కుమార్, వినేశ్, కిషోర్, శివకుమార్, సంతోష్ పాల్గొన్నారు.

కార్యాలయంలోనే నిలిచిన చెత్త సేకరణ ట్రాలీలు

బయటకు రానిచెత్త సేకరణ వాహనాలు

- డీజిల్ పోయడానికి నిరాకరించిన బంక్ యజమాని

కోల్‌సిటీ, ఫిబ్రవరి 21: రామగుండం కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభాగంలో సమన్వయ లోపంతో శుక్రవారం చెత్త సేకరణ వాహనాలు నిలిచిపోయాయి. ప్రతి రోజూ ఆయా డివిజన్లకు ఉదయాన్నే వెళ్లి చెత్త సేకరించి డంప్ యార్డుకు తరలించాల్సిన ఆటో ట్రాలీలు కార్యాలయం నుంచి బయటకు రాలేదు. ఆ వాహనాల్లో డీజిల్ పోయడానికి బంక్ యజమాని నిరాకరించడంతో ఆటో ట్రాలీలు కదలకుండా ఉండి పోయాయి. పారిశుధ్య విభాగంలో గతంలో ఉన్న 50 చెత్త ట్రాలీ లతో పాటు ఇతర భారీ వాహనాలు కలిపి మొత్తం సుమారు 70కి పైగా వాహనాలు ఉన్నాయి. వీటిలో ఇంధనం కోసం ప్రతి నెలా పెట్రోల్ బంక్ యజమానికి బిల్లులు చెల్లిస్తుంటారు. ఈ నెల బిల్లుల జారీ విషయంలో ఆలస్యమవుతుందని భావించి బంక్ యజమాని శుక్రవారం వాహనాల్లో డీజిల్ పోయడానికి నిరాకరించారు. దీంతో దాదాపు 10 చెత్త సేకరణ ట్రాలీలు కార్యాలయంలోనే నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా బల్దియా కార్యాలయం నుంచే బంక్ యజమానికి తప్పుడు సం కేతాలు పంపించిన వారిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈవిషయమై సెక్షన్ ఇన్‌ఛార్జి సునీల్ రాథోడ్‌ను వివరణ కోరగా, కేవలం 10 వాహనాలు మాత్రమే డీజిల్ లేక ఆగిపోయాయనీ, మిగతా వాహనాలు యథావిధిగా నడుస్తున్నాయని తెలిపారు. ఈనెల బిల్లుల చెల్లింపునకు మరో మూడు రోజుల గడువు ఉందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలి పారు. కాగా, కొద్ది రోజులుగా కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభా గంలో జరుగుతున్న కోవర్టుల గురించి రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

మాతృ భాషా దినోత్సవం

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 21: పెద్దకల్వలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మినర్సయ్య మాట్లాడుతూ..మాతృ భాష ద్వారానే విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తారని ఎన్‌సీసీ క్యాడెట్‌లు, సమాజ సేవ మాతృ భాషతోనే సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తారని అన్నారు. మాతృ భాష వినియోగంలో విద్యార్థుల పాత్ర కీలకంగా ఉంటుందని ఆదిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎ.సతీష్‌కుమార్, డాక్టర్ ఎ.నారాయణ, శ్రీ షుకూర్, బి.మురళి, డాక్టర్ ఎ.శాలిని, డాక్టర్ తిరుపతి, సునీత, అంజయ్య, ఆర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నియామక పత్రం అందుకుంటున్న రాజమల్లయ్య

ధర్మారం,ఫిబ్రవరి21: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎస్‌జేడబ్ల్యూహెచ్ఆర్‌సీ)వైస్ చైర్మన్‌గా ధర్మారం మండలం నంది మేడారం ప్యాక్స్ వైస్ చైర్మన్ సామంతుల రాజమల్లయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాజమల్లయ్యకు కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల విజయ్ కుమార్ నియామక ఉత్తర్వులు శుక్రవారం అందజేశారు. ఇక్కడ కౌన్సిల్ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి,జిల్లా చైర్మన్ మిట్ట తిరుపతి తదితరుల పాల్గొన్నారు.

ఆర్జీ-1లో క్వార్టర్ కౌన్సిలింగ్

గోదావరిఖని, ఫిబ్రవరి 21: సింగరేణి ఆర్జీ-1లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు శుక్రవారం స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్‌లో క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆర్జీ-1 ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్ హాజరయ్యారు. కేటగిరీ 1 నుంచి కేటగిరీ 6వరకు ఉద్యోగులకు కౌన్సిలింగ్ చేశారు. 348 క్వార్టర్లకు గాను 223 మంది ఉద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇక్కడ ఏఐటీ యూసీ నాయకులు ఆరెల్లి పోశం, పర్సనల్ డీజీఎం కిరణ్‌బాబు, సీనియర్ పర్సనల్ అధికారి హన్మంతరావు, సంక్షేమాధికారులు ఇక్బాల్, షరీఫ్, రవీందర్, క్వార్టర్ సెక్షన్ సిబ్బంది శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

జ్యోతినగర్(రామగుండం), ఫిబ్రవరి 21: ప్రాజెక్టు డిగ్నిటీ పేరిట లెర్నింగ్ కర్వ్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సంస్థ సంయుక్తంగా పంపిణీ చేస్తున్న శానిటరీ ప్యాడ్స్ రామగుండంలోని కేజీబీవీ విద్యార్థినులకు శుక్రవారం అందజేశారు. డీఈవో మాధవి, జీఈసీవో కవిత బాలికలకు ఏడాదికి సరిపడా శానిటరీ ప్యాడ్స్ అందజేశారు. ఇక్కడ లెర్నింగ్ కర్వ్ సీవోవో స్వప్న, సీనియర్ ప్రోగ్రామ్ అసోసియేట్ తులసి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ ఉన్నారు.

కాంట్రాక్టర్ల పరస్పరం దాడి

యైటింక్లయిన్ కాలనీ ఫిబ్రవరి 21 : ఆర్జీ-2 ఏరియాలో సింగరేణి కాంట్రాక్టర్లు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘటనపై ఇరువురు కాంట్రాక్టర్లు పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నట్లు తెలిసింది. వివరాలిలా ఉన్నాయి. కాంట్రాక్టర్లు ముక్కెర మొగిళి, ఫయాజ్ గతంలో జరిగిన కాంట్రాక్టు పనులపై శుక్రవారం స్థానికంగా ఉన్న ఐరన్ షాపు వద్ద మాట్లాడుకుంటున్నారు. వీరిద్దరి మధ్య మాటామాట పెరిగి గొడవ పడినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఫయాజ్ అక్కడ ఉన్న ఇస్త్రీ పెట్టెతో ముక్కెర మొగిళి మెడపై కాల్చాడు. అక్కడ ఉన్న పలువురు కాంట్రాక్టర్లు వారిద్దరికి సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ ఘటనపై ముక్కెర మొగిళి గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా అక్కడ ఉన్న సిబ్బంది నిరాకరించినట్లు తెలిసింది. మొగిళి నేరుగా సీపీని కలిసి ఫిర్యాదు చేశారు.

విరాళం అందజేత

ధర్మారం,ఫిబ్రవరి21: రచ్చపల్లిలోని శ్రీ సాంబమూర్తి ఆలయానికి అదే గ్రామానికి చెందిన కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ జక్కుల దామోదర్ రూ.30,116 విరాళం అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పెర్క రవీందర్,వైస్ చైర్మన్ గుండా రవీందర్, సభ్యుడు చింతల తిరుపతికి దామోదర్‌రావు అందజేశారు.

దేవాదాయశాఖకు ఆలయ నిర్వహణ బాధ్యతలు

పెద్దపల్లి కమాన్, ఫిబ్రవరి 21 : పెద్దపల్లి లోని రైల్వేస్టేషన్ రోడ్ శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ పూర్తి స్థాయి నిర్వహణ భాధ్యతలను ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్వర్తించనున్నట్లు కరీంనగర్ సహాయ కమిషనర్ ఎన్. సుప్రియ తెలిపారు. ఈ మేరకు పెద్దపల్లిలోని ఆలయంలో శుక్రవారం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి ఆలయ నిర్వహణ బాధ్యతను స్వాధీనం చేసున్నారు. ఇక్కడ సుజాత, పీ సత్యనారాయణ, శంకరయ్య, కాంతారెడ్డి, రాజ్‌కుమార్, కె. శ్రీనివాస్, పీ కృష్ణతేజ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I Meer Mahammed Ali, S/o Syed Ismail, Born on 13/Aug/1975, residing at 2-7-467, Mukarampura, Karimnagar, Telangana-505001, have changed my name to Meer Mahamood Ali bearing passport no J2827924.

NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

యువకుడి ఆత్మహత్య

ఓదెల, ఫిబ్రవరి 21: గూడెం గ్రామంలో పురుగుల మందు తాగి గూడ దామోదర్(30) ఆత్మహత్య చేసుకున్నట్లు పొత్కపల్లి పోలీసులు తెలిపారు. దామోదర్ మక్కజొన్న చేనుకు నీరు పెట్టేందుకు గురువారం సాయంత్రం వెళ్లాడు. రాత్రి వరకు కూడా ఇంటికి తిరిగి రాలేదు. సెల్ ఫోన్‌కు కాల్ చేసినా ఎత్తలేదు. వెంటనే చేను వద్దకు వెళ్లి చూడగా, అక్కడ పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆనవాళ్లు కనిపించాయి. కొడుకు విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. తిరుపతమ్మ-రమేశ్‌లకు ఇద్దరు కుమారులు, బిడ్డ ఉన్నారు. దామోదర్ పెద్ద కొడుకు. పీజీ వరకు చదువుకున్నాడు. కొంత కాలంగా కడుపు నొప్పి ఉండడం, చదువుకున్న ఉపాధి ఏమీ లేక ఒంటరిగా దిగాలు చెందుతున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు లో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దామోదర్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

మద్యానికి బానిసై..

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 21: గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన కర్రావుల శ్రీనివాస్(55) మద్యానికి బానిసై శుక్రవారం ఇంట్లో సీలింగ్ ప్యాన్‌కు ఊరేసుకోని ఆత్మహత్యకు పాల్పడిపట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ భూమేశ్ తెలిపారు. శ్రీనివాస్ మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చెపట్టారు.

ప్రమాదవశాత్తూ బావిలో పడి రైతు

జూలపల్లి, ఫిబ్రవరి 21 : కుమ్మరికుంట గ్రామానికి చెందిన రైతు దొడ్ల లచ్చయ్య (58) శుక్రవారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. లచ్చయ్య మక్క చేనుకు సాగునీరు పెట్టడానికి ఇంటి నుంచి వెళ్లాడు. వ్యవసాయ బావిలోకి దిగి కరెంట్ మోటర్‌కు అమర్చిన పైపులు సవరించే క్రమంలో నీట మునిగాడు. బావిలో మొట్లు, ముళ్లపొరక తట్టుకొని బయటికి రాలేక ఊపిరాడక శవమై తేలాడు. భార్య కనకమ్మ ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సమస్య పరిష్కారానికి కృషి

జ్యోతినగర్, ఫిబ్రవరి 21: ఎన్టీపీసీ ప్రభావిత మాతంగికాలనీ కాలనీవాసుల సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మాతంగి కాలనీకి వచ్చిన ఎంపీ స్థానికులతో మాట్లాడారు. కాలనీవాసులకు పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లింపుపై ఇప్పటికే కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి దష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. అంతకుముందు ఎంపీ ఎన్టీపీసీ న్యూపోరట్‌పల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాంగ్రెస్ నాయకులు మెరుగు లింగమూర్తి, ముమ్మే బినేశ్ కుటుంబాలను పరామర్శించారు.

నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ

కమాన్‌పూర్, ఫిబ్రవరి 21: సుందరం ఫౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకట స్వామి రొంపికుంటకు చెంది